క్లుప్తంగా

పూర్తయిన పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో నేడు జరుగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కార్పొరేషన్ అధికారులు పూర్తి చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలో 41 బూత్‌లలో పురుషులు 21,061మంది, మహిళలు 22,724మంది, ఇతరులు 1తో కలిపి 43,786 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. తాడేపల్లి రూరల్‌లో 48 బూత్‌లలో పురుషులు 26,600 మంది, మహిళలు 27,555 మంది, వెరసి 53,155 మంది ఓటర్లు ఓటును వినియోగించుకోనున్నారు. దుగ్గిరాలలో 58 పోలింగ్ బూత్‌ల పరిధిలో పురుషులు 24,924 మంది, మహిళలు 26,828 మంది, ఇతరులు 4గురు మొత్తం 51,756 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. ఉదయం 5 గంటలకే బూత్ ఏజెంట్లకు మాక్ పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. తప్పని సరిగా బూత్ ఏజెంట్లు హాజరు కావాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సీఎం వైఎస్ జగన్ పాలన వైపే ప్రజలు మొగ్గు



తాడికొండ: తాడికొండలో ఎమ్మెల్యే సుచరిత గెలుపు నల్లేరుపై నడకేనని, ఘనమైన మెజారిటీతో నియోజకవర్గంలో విజయం సాధించబోతున్నారని ఏపీ మార్కెటింగ్ కో ఆపరేటివ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం తాడికొండలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభంజనం వీస్తుందని, దేశంలోనే సర్వజనులకు ప్రభుత్వ ఫలాలను ఇంటికే అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ వాస్తవాన్ని అనుభవదారులైన 88 శాతం ప్రజలు పూర్తి అవగాహన చేసుకొని జగనన్న పాలన పది కాలాలు కావాలని కోరుకుంటున్నారన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధిని సమాన స్థాయిలో తీసుకెళ్ళిన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని, మారుమూల గ్రామాల్లో సైతం విద్యాలయాలు, వైద్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఇంటింటికీ వైద్యం, వీటన్నింటికీ మించి గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. ఆడపడుచులు, వృద్ధులు, విద్యార్థులు 90 శాతం మా జగనన్న రావాలని ఆరాటపడుతున్నారన్నారు.

అనేక పథకాలను ఇంటికి చేర్చే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుపేదల పొట్టగొట్టేందుకు పూనుకున్న కుటిల కూటమి మూడు పార్టీల నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి ప్రజలను మోసగిస్తున్నారన్నారు. దాదాపు రూ.2.75 లక్షల కోట్లను ప్రజలకు నగదు రూపంలో ఇచ్చిన ఘనత 77 సంవత్సరాల స్వాతంత్ర్యంలో జగనన్నకే సాధ్యమైందన్నారు. అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నారని, గ్రామాల్లో శాశ్వతంగా జరిగినది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. తీర ప్రాంతంలో 4 పోర్టులు, 10 హార్బర్లతో 50 లక్షల మందికి ఉపాధి కల్పించే నిర్మాణాలు జరుగుతుంటే అది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు 50 శాతానికి పైబడి రాజ్యాధికారం ఇచ్చిన చరిత్ర దేశంలోనే ఏపీకి దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను 99 శాతం అమలు పరచిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు.

ఓటేస్తే... వైద్య పరీక్షల్లో 50శాతం రాయితీ

గుంటూరు మెడికల్: సోమవారం పోలింగ్ రోజు మీ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని నేషనల్ లివర్ - గ్యాస్ట్రో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.షేక్ కోరారు. ఓటు వేసిన గుర్తుని చూపించి తమ ఆస్పత్రిలో వైద్య పరీక్షల్లో 50శాతం రాయితీ పొందవచ్చన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు స్థానిక ప్రత్తిపాడు రోడ్ అర్.అగ్రహారం, అపోలో ఫార్మసీ ఎదురుగా ఉన్న తమ ఆస్పత్రిలో జరిగే వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

- వైఎస్సార్ సీపీ పాలనలో మంగళగిరి చరిత్రలో ఎన్నడూ లేని అభివృద్ధి
- నేడు రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా మారిన వైనం
- మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఎమ్మెల్యే ఆర్కే కృషి
- రూ.3.50 కోట్లతో చేనేత కార్మికులకు మగ్గం షెడ్ల నిర్మాణం
- ప్రభుత్వ తోడ్పాటుతో చేనేతల జీవితాల్లో కొత్త వెలుగులు

అభివృద్ధి పరవళ్లు..
నేతన్నల జీవితాల్లో కాంతులు



మంగళగిరిలో అద్దంలా రూపుదిద్దుకున్న గౌతమబుద్ధా రోడ్డు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక మంగళగిరి నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దీంతో 2024 ఎన్నికలలో అభివృద్ధే ఆయుధంగా వైఎస్సార్ సీపీ ప్రచారం చేపట్టింది. గత ఐదు సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గమనించి 2024 ఎన్నికలలో తమకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజలను కోరుతున్నారు. 2019కి ముందు అధికారంలో ఉన్న టీడీపీ మూడు శాఖల మంత్రి లోకేష్, ఇదే నియోజకవర్గంలో నివాసం ఉంటున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయకపోవడంతో టీడీపీ నాయకులు ప్రచారంలో ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. 2019లో మంత్రిగా ఉన్న లోకేష్ మళ్లీ మంగళగిరి నుంచి పోటీ చేసినా సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆయనపై ఆలవోకగా రెండవ సారి విజయం సాధించారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్కే పార్టీ అధికారంలో లేకపోయినా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ తన స్వంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తూ ప్రజలకు అండగా నిలిచారు. అనేక సేవా కార్యక్రమాలతో నియోజకవర్గ ప్రజల హృదయాలలో నిలిచిన ఎమ్మెల్యే ఆర్కే రెండవ సారి లోకేష్‌పై అలవోకగా విజయం సాధించి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలో అభివృద్ధి బాట పట్టించారు. అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా రూపు దిద్దుకుంటున్న మంగళగిరిలో ఇప్పటి వరకు వందల కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు

ఏ సామాజికవర్గంలోనూ పేదవారు తమ ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో నగరంలో ప్రతి సామాజికవర్గానికి కమ్యూనిటీ హాళ్లను నిర్మించారు. రూ.10 కోట్లతో నగరంలోని ప్రతి సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాళ్లు నిర్మించడంతో ఆయా సామాజిక వర్గాలలోని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలకు పెద్దపీట

నగరంలోని క్రీడాకారుల కొరకు ప్రత్యేకంగా వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. రూ.7 కోట్లతో తాగునీటి పథకం ఆవరణలో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, పవర్ లిఫ్టింగ్ కోచ్ సెంటర్‌లు పూర్తి చేసుకోగా నూతనంగా షటిల్ ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతుండటంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆర్కే కృషితో పరవళ్లు తొక్కిన ప్రగతి

గత టీడీపీ పాలనలో కనీసం గౌతమ బుద్దా రోడ్డు విస్తరణ చేయలేక పోగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే ఆర్కే రూ.24 కోట్లతో గౌతమ బుద్దా రోడ్డు విస్తరణ చేశారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపాల్టీలతో పాటు 21 గ్రామాలను కలిపి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఏర్పాటు చేయడంతో నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. విలీన గ్రామాలను పట్టణాలకు కలుపుతూ రోడ్లు నిర్మాణం చేయడంతో పాటు విలీన గ్రామాలలో డొంకరోడ్లు, లింకు రోడ్లు నిర్మాణాలను రూ.123 కోట్లతో పూర్తి చేశారు. మరో రూ.2 కోట్లతో తాగునీటి పథకానికి నూతన పంప్ హౌస్ నిర్మించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

ఎనలేని అభివృద్ధి, సంక్షేమం..

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం, మంగళగిరి అంటే గుర్తుకు వచ్చే 153 అడుగుల ఎత్తయిన గాలి గోపురం, చేనేతకు పుట్టినిల్లు, ప్రఖ్యాతి గాంచిన ఉండవల్లి గుహలు, చెంతనే ప్రకాశం బ్యారేజి, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి, ఏపీఎస్పీ ఆరో బెటాలియన్, 25 ప్రభుత్వ ప్రధాన శాఖల కార్యాలయాలు, ఎయిమ్స్ ఆసుపత్రి, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, ప్రైవేటు మెడికల్ కళాశాలలు, ఇంజినీరింగ్ డీమ్డ్ యూనివర్శిటీలతో మిళితమైన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం విస్మరించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసిన ఎమ్మెల్యే ఆర్కే ఆదిశగా అభివృద్ధి పనులు కొనసాగిస్తూ అభివృద్ధిలో రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతుండడంతో నియోజకవర్గ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపాల్టీలతో 21 గ్రామాలను కలిపి మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థగా మార్చడంతో నగరంలో అభివృద్ధి పరవళ్ళు తొక్కుతుంది. 3.50 లక్షల జనాభా కలిగిని కార్పొరేషన్ 194 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో రాష్ట్రంలోనే రెండవ అతి పెద్ద కార్పొరేషన్‌గా రూపుదిద్దుకుంది. మౌలిక వసతులకు సంబంధించి ఇప్పటికే పలు అభివృద్ధి పనులు పూర్తికాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయి.

మీ పాలనలో ఏం చేశారో చెప్పండి..

2014 అధికారంలోకి వచ్చిన టీడీపీ హయాంలో మంగళగిరిలో ఎలాంటి అభివృద్ధి చేశారో చెప్పాలని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2014లో టీడీపీని ఓడించి ఎమ్మెల్యే ఆర్కేకు పట్టం కట్టారనే కక్షతో అధికారంలో ఉన్నా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, మూడు శాఖల మంత్రిగా ఉన్న లోకేష్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలపై కక్ష కట్టి ఒక్క అభివృద్ధి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం కార్పొరేషన్‌గా మారడంతో అభివృద్ధి కొత్తపుంతలు తొక్కింది. చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం వచ్చేలా చేనేత భవనం, మగ్గాల షెడ్లు నిర్మించడం అభినందనీయం. మగ్గాల షెడ్ల నిర్మాణంతో ఎంతో మంది కార్మికులకు ఆదాయం పెరిగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేనేత పరిశ్రమ పూర్వవైభవం సంతరించుకుంది. దుకాణ సముదాయం ప్రారంభమైతే మార్కెటింగ్ పెరగడంతో మరింత అభివృద్ధి చెందుతుంది.

– దివి హరనాథ్, అంబటి నగర్

వైద్య, ఆరోగ్యానికి పెద్దపీట

కార్పొరేషన్‌లో రూ.15.50 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి రావడంతో రోగులకు ఇంటివద్దనే నాణ్యమైన సేవలందుతున్నాయి. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రభుత్వం రూ.82 కోట్లు కేటాయించగా ఎమ్మెల్యే ఆర్కే చొరవతో కార్పొరేషన్ నుంచి మరో రూ.80 లక్షలు కేటాయించి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా నిర్మాణం చేశారు. దీంతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిన ఇందిరానగర్ హెల్త్ సెంటర్ దేశంలోనే 96.02 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రజలకు వైద్య సేవలందించడంలో ఆదర్శంగా వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు నిలుస్తున్నాయనడంలో సందేహంలేదు.

చేనేత పరిశ్రమకు ప్రాధాన్యత

మంగళగిరి అంటేనే గుర్తు వచ్చే చేనేత పరిశ్రమ అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే ఆర్కే కృషి చేస్తుండడంతో నేతన్నలు సంతోషిస్తున్నారు. రూ 3.50 కోట్లతో చేనేత కార్మికుల కొరకు మగ్గం షెడ్ల నిర్మాణం పూర్తి కాగా 1500 కుటుంబాలకు పైగా మగ్గాల షెడ్లపై ఆధారపడి జీవిస్తున్నారు. చేనేత ఉత్పత్తిదారులు, వ్యాపారుల కొరకు రూ.5 కోట్లతో చేపట్టిన చేనేత భవన నిర్మాణం పూర్తయ్యి వ్యాపారులకు దుకాణాల కేటాయింపుకు సిద్ధంగా ఉంది. మంగళగిరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మంగళగిరి ముఖద్వారంలో నేతన్న విగ్రహం ఏర్పాటు, నేతన్న సర్కిల్‌గా నామకరణం చేయడంతో నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నడూ లేని అభివృద్ధిని చూశాం



గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం అభివృద్ధి చెందిందనడంలో సందేహం లేదు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో విలీన గ్రామాలలో సమస్యలు పరిష్కారమయ్యాయి. ముఖ్యంగా రైతుల పొల్లాలోకి వేసిన గ్రావెల్ రోడ్లు ఎంతో ఉపయోపడుతున్నాయి. గౌతమ బుద్ధారోడ్డు విస్తరణతో పాటు పలు రోడ్ల విస్తరణతో నగరం ఎంతో అభివృద్ధి చెందింది.

– కట్టెపోగు నందు, నిడమర్రు

టీడీపీ హయాంలో పనికో రేటు



టీడీపీ ప్రభుత్వంలో ఏ పని కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ, నాయకులు చుట్టూ తిరిగి లంచాలు ఇస్తే నెలల తరబడి తిప్పేవారు. ఇప్పుడు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధి ఐదేళ్లలో ఎంతో జరిగింది. మరలా సీఎంగా జగనన్నను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– మల్లవరపు మరియమ్మ, కాజ గ్రామం



మంగళగిరి ఏరియల్ వ్యూ



గణపతినగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



పాతబస్టాండ్ ఆవరణలో నిర్మించిన చేనేత భవనం

ఎన్నికల సమరానికి సర్వం సిద్ధం

- నేడు సార్వత్రిక ఎన్నికల నిర్వహణ
- పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల ఏర్పాటు
- సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు
- నేటి ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం



మంగళగిరిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



మంగళగిరిలో సిబ్బందికి ఈవీఎంలు అందజేస్తున్న జేసీ రాజకుమారి

మంగళగిరి: సోమవారం నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నియోజకవర్గంలో 300 పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేసీ రాజకుమారి ఘనియా తెలిపారు. ఆదివారం నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట నిర్మల ఫార్మసీ కళాశాల ఆవరణలో 300 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను ఎన్నికల అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం జరగనున్న ఎన్నికలకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఓటర్లు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముందన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 450 పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించి అక్కడ మరింత బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

తాడికొండ: ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీసు విభాగం ఆధ్వర్యంలో వెబ్ కెమెరాలతో నిఘాను కొనసాగిస్తున్నారు. తాడికొండ నియోజకవర్గంలో మొత్తం 244 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందులో 62 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమెరాల ద్వారా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగా 68– 70 శాతం పోలింగ్ జరుగుతుందనే అంచనా వేశారు. ఇటీవల జరిగిన హోం ఓటింగ్‌లో 258 మంది 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, 180 మంది వికలాంగులు తమ ఓటు హక్కును ఇంటి వద్దే వినియోగించుకోగా ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు 1,654 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారు. ఇక మద్యం, నగదు పంపిణీకి పార్టీలు తెరలేపడంతో పోలీసులు తమ నిఘాను పెంచి గస్తీ ముమ్మరం చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

ఫిరంగిపురం: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 18 గ్రామాల్లోని 65 పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని అన్ని పోలింగ్‌బూత్‌లను ఆదివారం ఆమె పరిశీలించి మౌలిక వసతుల ఏర్పాటుపై సమీక్షించారు. బూత్‌లవద్ద షామియానాలు, కుర్చీలు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు వంటివి ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ బూత్ పరిసర ప్రాంతాలను పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా శుభ్రం చేయించినట్లు తెలిపారు.

బియ్యం, సరుకులు పంపిణీ



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులు, దివ్యాంగులకు తమ వంతుగా సహాయం అందించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. నెలా నెలలో భాగంగా ఆదివారం కొత్తపేటలోని సమితి కార్యాలయంలో వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు 13 రకాల నిత్యావసర వస్తువులు, బియ్యం కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి కూర్నాల హరివెంకటసతీష్ మాట్లాడుతూ సమితి తరఫున ఎంతో కాలంగా పేదలకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, కూరపాటి లీలాకర్, పలకలూరి శివరావు, మామిడి వెంకటశ్రావణ్, టి.మురళీ సాయి, పల్లంపాటి రజనీశ్వరరావు, టీజీ సారథి, మాజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.